## కేటిదొడ్డిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన నియోజకవర్గం ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

**కేటిదొడ్డి ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** జోగు శాంబ గద్వాల నియోజకవర్గం కేటీదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామం స్టేజి నందు వేసవికాలం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు గాజుల కృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బాసుహనుమంతు నాయుడు హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బాసు హనుమంతు నాయుడుకు గ్రామ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు మరిన్ని చేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరూ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు... చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన కృష్ణారెడ్డి ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ పార్టీ నాయకులు చక్రధర్ రావు, బీచుపల్లి, అల్లపాడు ప్రతాప్, మోనేష్, వెంకటేష్ నాయుడు, జాంపల్లి భరత్ సింహారెడ్డి, శేఖర్ నాయుడు, నక్క రవి, కావల గోపి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుండి శ్రీ శేషదాసుల ఆరాధనోత్సవాలు

**మల్దకల్ ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో వెలిసిన శ్రీ శేషదాసుల 141 వ ఆరాధన ఉత్సవాలు గురువారం నుండి శనివారం వరకు జరుగుతాయని శ్రీ శేషదాసుల సేవా ట్రస్ట్ అధ్యక్షులు ధీరేంద్ర దాస్ రాఘవేంద్ర దాస్ శశాంక విష్ణు దాస్ లు ఒక ప్రకటనలో తెలిపారు. 23 గురువారం ఉదయం పంచామృతాభిషేకం శ్రీ ధన్వంతరి హోమం భజన మండలివారిచే కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే సంగీత దాసవాణి కార్యక్రమంలో శృతి కేరూరు వారిచే సంగీత కచేరి జరుగుతుందని, 24న పవమాన హోమం, రథోత్సవం కార్యక్రమం తో పాటు వెంకోబారావు, గంగాకేడ్, నారాయణరావు, వరదేంద్ర వారిచే హరినామ సంకీర్తనలు, 25న శ్రీ సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ప్రముఖ గాయకుడు రాయచూరు శేషగిరి దాస్ వారిచే దాసుల వారి సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమానికి టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి పగిడాల ఆనంద తీర్థ చారి హాజరవుతారని తెలిపారు. ఇట్టి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కటాక్షానికి పాత్రులు కావాలని వారు కోరారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**తిరుమలంపల్లి సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్ రెడ్డి**



కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన గ్రామ సర్పంచ్

**కోయిల్‌కొండ ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** వరి కొనుగోలు కేంద్రాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోయిలకొండ మండలం తిరుమలం పల్లి గ్రామ సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో చేపట్టిన వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకొని వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సర్పంచ్ సూచించారు. రైతుల ఖాతాల్లోకి నేరుగా వరి ధాన్యము డబ్బులు పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిసి కేశవులు, గ్రామ పెద్దలు రవీందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**లింగాల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో మృతి చెందిన బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అప్పాయిపల్లి మాజీ సర్పంచ్ రవీందర్ నేతృత్వంలోని మనం మన భాద్యత సభ్యులు వివరాల లోకి వెళితే అప్పాయి పల్లి గ్రామంలో నర్స లక్ష్మమ్మ మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలోని మనం మన భాద్యత సభ్యులు బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయలు, 25కెజిల బియ్యంను 6వ వార్డు సభ్యులు యాదగిరి సలేశ్వరం అందించారు. మృతురాలి కుటుంబసభ్యులకు ప్రగాడసానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో నెల్లికుదురు నరేష్, ఆవుల మల్లయ్య, నిరంజన్, రాజుగౌడ్, మురళి, ప్రసాద్, నవీన్, శేఖర్‌యాదగిరి, సలేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**నవాబుపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కిషన్ గూడా ఉపాధి హామీ పనులను ఎంపీడీవో జయరాం నాయక్ బుధవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, కూలీల సంఖ్య పెంచాలని, ప్రతి కూలి సరైన కొలత ప్రకారం పనిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనుల నాణ్యతను, మాస్టర్ రోల్స్‌ను పరిశీలించారు. కూలీలకు మంచి నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఉపాధిహామీకూలీలతో మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, కొలతల ప్రకారం పనిచేయాలని, దాని ప్రకారమే వేతనాలు చెల్లింపు జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధికార్యక్రమాలను పరిశీలించి ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. పనుల్లో జాగ్రత్త వహించి ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, గ్రామ సర్పంచు పంచాయతీ కార్యదర్శి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్" పథకం కింద గిరిజన బాల బాలికలకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పథకం ద్వారా 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. జిల్లాలో మొత్తం 15 సీట్లు ఖాళీగా ఉన్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 7, 2026లోపు దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఏప్రిల్ 22 నుండి ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. దరఖాస్తులను జిల్లాగిరిజన అభివృద్ధిఅధికారి కార్యాలయం, రూమ్ నం.123, జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం, పాలకొండ, మహబూబ్‌నగర్‌లో సమర్పించవలసి ఉంటుంది. జిల్లాస్థాయిలో అందిన దరఖాస్తుల నుంచి మే14, 2026న నారాయణపేట కలెక్టర్ కార్యాలయంలో లాటరీపద్ధతిలో 15మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికఆదాయం గ్రామీణప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు మించకూడదు. దరఖాస్తుతో పాటు కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలని అధికారులు సూచించారు. అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోరారు.

## వడగళ్ల వాన తర్వాత వరి రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

**వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్**



పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్

**మద్దూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** మద్దూరు మండల పరిధిలో మంగళవారం కురిసిన వడగళ్ల వానతో కోత దశలో ఉన్న వరి పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యవసాయఅధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాకేష్, తిరుమలేష్‌లు చెన్నారెడ్డి పల్లె, పెద్దిరిపాడు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వడగళ్ల వాన అనంతరం పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే పారుదల ఏర్పాటు చేయాలని సూచించారు. పడిపోయిన వరి మొక్కలను సాధ్యమైనంతవరకు నిలబెట్టి, వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు త్వరగా కోత చేపట్టాలని తెలిపారు. తడిసిన గింజలను పొడి గింజలతో కలపకుండా వేరుగా ఉంచి, కోత అనంతరం సూర్యరశ్మిలో బాగా ఎండబెట్టాలని సూచించారు. తేమ కారణంగా ఫంగస్ వ్యాప్తి అవకాశం ఉండడంతో అవసరమైతే శిలీంధ్రనాశకాలను ఉపయోగించాలని తెలిపారు. రైతులు ఈ సూచనలు పాటిస్తే వడగళ్ల వాన వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు అవగాహన కల్పించారు.

# ఆర్టీసీ సమ్మె ప్రభావం బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు

**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆర్టీసీ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సమ్మె కారణంగా ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నారాయణపేట డిపోలో మొత్తం 103 బస్సులు ఉండగా, వాటిలో 57 ఆర్టీసీ బస్సులు, 46 ప్రైవేట్ బస్సులు ఉండగా అయితే, ప్రైవేట్ బస్సుల్లో కేవలం 5 మాత్రమే సేవలు అందిస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది విజయలక్ష్మి, వీరేంద్ర మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన నేపథ్యంలో, బీజేపీ నాయకులు వారికి సానుభూతి తెలిపారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్ సత్య రఘుపాల్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ తదితరులు మద్దతు ప్రకటించారు నాగురావు నామాజీ మాట్లాడుతూ టీజీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా కార్మికుల సమస్యలపై మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులు తమ ప్రధాన డిమాండ్లుగా రెండో వేతన సవరణ అమలు, విశ్రాంతి ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల వంటి అంశాలను ప్రస్తావిస్తున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలకు మరింత ఇబ్బందులు కలుగుతాయని వారు హెచ్చరించారు. మొత్తంగా, ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజా రవాణా సేవలు తీవ్రంగా ప్రభావితమై, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బస్టాండ్‌కే పరిమితమైన బస్సులు



సమ్మెలో ఆర్టీసి కార్మికులు

### హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

**సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె**

**అచ్చంపేట, ఏప్రిల్, 22 ప్రభాతవార్త :** ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన అనేక హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. బుధవారం పట్టణంలో ఆర్టీసీ డిపో ఆవరణలో సామూహిక సమ్మెకు దిగారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వంతో సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ ఎలాంటి సానుకూల స్పందన రాక పోవడంతోనే విధిలేని పరిస్థితుల్లో సమ్మె బాట పట్టామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం మా డిమాండ్ల పరిష్కరించే వరకు ఒక్క బస్సు బయటికి వెళ్లనీయమని స్పష్టం చేశారు. అయితే పోలీసు అక్కడికి చేరుకుని డిపో మేనేజర్ ప్రైవేట్ డ్రైవర్లు కండక్టర్లతో కొన్ని బస్సులు నడిపారు. వివిధ అవసరాల నిమిత్తం రోజువారీగా వెళ్ళే ప్రయాణికులు ఈ సమ్మె మాకు తెలియదని ఉదయాన్నే బస్టాండుకు వచ్చి కూర్చున్నారని బస్సులు లేక చిన్న పిల్లలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లు పాల్గొన్నారు.



డిపోలకే పరిమితమైన బస్సులు

## ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్‌తర పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ ఏడోవార్డు బీజేపీ కౌన్సిలర్ లత సూరన్నగారి(హేమలత)తో పాటు మరికొంత మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్ రెడ్డి భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ పర్యటనకు వచ్చిన సం దర్భంగా అమిస్తాపూర్ ఏడోవార్డు కౌన్సిలర్(బీజేపీ) లత సూరన్నగా రి(హేమలత)ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హేమలతకు కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే జీఎంఆర్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. లతసూరన్నగారి(హేమలత)తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలువురు ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నాయకులు నర్సింహులు, సత్తయ్య, బాలరాజు, జైపాల్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. లతసూరన్న గారి(హేమలత) కాంగ్రెస్‌లో చేరికతో భూత్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం ఎనిమిదికి చేరింది. పది కౌన్సిలర్ స్థానాల్లో చైర్మన్, వైస్ చైర్మన్లతో సహ ఎనిమిది మంది కౌన్సిలర్లు అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, ఇద్దరు కాంగ్రెసేత పార్టీలకు చెందిన వారు ఉన్నారు. వీరిలో ఒకరు బీజేపీకి చెందిన కెంద్యాల శ్రీనివాసులు( ఆరో వార్డు), ఇంకొకరు బీఆర్ఎస్ పార్టీకి చెందినుమార్(నాల్గోవార్డు) ఉన్నారు. బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నవారిలో ఏడోవార్డు కౌన్సిలర్ లత సూరన్నగారితో పాటు భూత్పూర్ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సభ్యులు ప్రవీణ్, వసంత తదితరులు ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమపథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కౌన్సిలర్ లతతో పలువురు నాయకులు, వార్డు సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, ఐదోవార్డు కౌన్సిలర్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడులిక్కి నవీన్‌గౌడ్, మాజీ ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్‌లతో పాటు నాయకులు ఆగిరి రవి, కెంద్యాల నరేందర్, కెంద్యాల మశ్చందర్, కెంద్యాల రాజేష్‌కుమార్, మట్టి ఆనంద్, కోరె వపన్, శ్రీదేవి పవన్, పాష, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసింది

**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత**


**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాల ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దనే ఉంచుకొని, విద్యపై అధిక దృష్టిని కేంద్రీకరించి, విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. బుధవారం దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి దేవి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. గత ఎన్నికలలో నేను ఇచ్చిన హామీ మేరకు దేవరకద్ర నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, పలు పాఠశాలలను సందర్శించి, మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా కాలినడకన వెళ్లే విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్స్ షూస్ తో పాటు, టై, బెల్ట్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పాఠశాలలు, కాలేజీల మౌలిక వసతులు అభివృద్ధి ఆధునిక సదుపాయాల కల్పన ఉపాధ్యాయుల ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. విద్యారంగా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకొస్తూ, ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ దాతలు బాదం బాలస్వామి, బాదం బాలకృష్ణ జ్ఞాపకార్థంతో వారి మనుమడు బాదం ప్రవీణ్ కుమార్, కిరణ్ కుమార్ (దేవరకద్ర బిజెపి ఉపాధ్యక్షులు) సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ దాతలు పలుసు జనార్దన్ గౌడ్, లక్ష్మీనారాయణ, ఉంద్యాల అనంతరెడ్డి, గాజులపేట హరికృష్ణ దాతలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వారి బడి పిల్లల రచనలు, పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు, ఉపసర్పంచ్ నరహరి, దూకుడు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ దీపికా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, బస్వాయిపల్లి సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ గోవర్ధన్, ఫక్రుద్దీన్, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర చారి, ఉపాధ్యాయ బృందం, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ



ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు లబ్దిదారులకు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఇండ్లు లేని పేద ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు సకాలంలో ప్రారంభించాలని ఎంపీడీవో కొండన్న, గృహనిర్మాణశాఖ ఏఈ ప్రేమ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు డి.యగ్నేశ్వర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన 100 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం చేపట్టుకోవాలని దశలవారీగా బిల్లులు చెల్లిస్తామన్నారు. వేసవికాలంలోనే ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే సకాలంలో బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. రెండో విడత ఇందిరమ్మఇండ్లు అమిన్‌పూర్‌కు19, బిజ్వార్‌కు15, చిన్న పోర్లకు20, ఎడవెల్లికి17, త్రిప్రాసు పల్లికి 10, మల్లేపల్లికి 5ఇండ్లు, పగిడిమర్రికి 14 ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందిరమ్మ కలలు నెరవేర్చడంతోపాటు పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూసేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ, ఆయా పంచాయతీ కార్యదర్శుల సలహాలు సూచనల మేరకు ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, కొల్లంపల్లి అంజయ్య, టప్ప నాగేష్, జాఫర్, అంజయ్య, విజయలక్ష్మి నరసింహ, గాండ్ల నిఖీత ప్రశాంత్ నాయకులు గోవిందప్ప, విజయసింహారెడ్డి, పగిడిమర్రి ఘని, గోపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూర్‌లో విగ్రహాల ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



పత్యేక పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల ఇతర నాయకులు

**భూత్పూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తూర్ గ్రామంలో గ్రామస్తులు అంజనేయస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం, గణపతి విగ్రహంతో పాటు కోటమైసమ్మ అమ్మవారి విగ్రహాల ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అన్నాసాగర్ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి, నాల్గోవార్డు కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టీ మురళీధర్‌గౌడ్, మొల్గర నర్సింహ్మయ్యగౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, ఆకుల వెంకటయ్య, గొడుగు అంజనేయులు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతిమ్మప్ప స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

**మల్దకల్ ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం గద్వాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమా పూజిత సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం బహుకరించారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ

**గండీడ్ ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** గండీడ్ మండల పరిధిలో సాలానగర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు బుధవారం గ్రామ సర్పంచ్ అంజనేయులుగౌడ్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గారు మాట్లాడుతూ ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు తగిన జాగ్రత్తలు పాటించాలని, తరచూ నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ మల్లికార్జునమ్మ, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, సీనియర్ మేటి రాములు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్

**దామరగిద్ద, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం గత్ప గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ పనులను గ్రామ సర్పంచ్ అవుటి మల్లమ్మతో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరేష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు మరింత సులభతరం అవుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ మల్లమ్మకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పిడెంపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభ దృశ్యం

**దామరగిద్ద, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం బాపన్‌పల్లి, పిడెంపల్లి, మద్దెలబీడ్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. ప్రభుత్వం రైతుల కోసం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వివిధ గ్రామాల సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, దామరగిద్ద సర్పంచ్ కనికి రెడ్డి, బాపన్‌పల్లి సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్ బొడ్డు నర్సిములు, ఉప సర్పంచ్ అంజి, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



ఐసిడీఎస్ అధికారులతో మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్

## ప్రభుత్వం అందించే పోషక ఆహారాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

**కల్వకుర్తి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందించే సరుకులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ఐసిడీఎస్ వారు ఏర్పాటు చేసిన పోషక పక్వాడ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సరుకులు పాలు, గుడ్లు, ఆకుకూరలు చిరుధాన్యాలు మొదలగునవి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ మొహమ్మద్, వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, రామకృష్ణ, రమాకాంత్ రెడ్డి, కోడెల గణేష్, చిత్తరి శ్రీను, ఐసిడిఎస్ అధికారులు (టీచర్స్) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును పరిశీలించిన అధికారులు



నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్

**వెల్దండ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును తొలగింపు చేయాలని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అభ్యర్థన మేరకు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంధ్యారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం 40 సంవత్సరాల క్రితం నిర్మించిన నీటి ట్యాంకు శిథిలావస్థలోకి చేరి కూలి పోయే ప్రమాదంలో ఉందని, ఎమ్మెల్యే సహకారంతో పాత నీటి ట్యాంకును తొలగించి కొత్తట్యాంకు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్వమోని శ్రీనివాస్, ఆర్‌డబ్లుఎస్ ఏఈ లలిత, వార్డు సభ్యులు ఎస్‌శేఖర్, బాదేపల్లి రమేష్, కార్యదర్శి గిరి, మంగళగిరి శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## 16వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలి

**మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్లకు స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని వినతి**

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీలోని 16వ వార్డు పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యుత్తు, తాగునీరు, ఇతర సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, కమిషనర్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తీవ్ర ఎండలు ఉన్నందున తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, దీంతో పాటు వీధి దీపాలు లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ సమస్య సైతం తీవ్రంగా ఉందని వారి దృష్టికి తీసుకువచ్చారు. వీధి దీపాల ఏర్పాటు కోసం 50 ఎల్ఈడి బల్బులు, 9 మీటర్ల పోల్స్, ఆరు స్టార్టర్ బాక్సులు, ఐదు బోర్ మోటార్లు, 100 మీటర్ల సర్వీస్ వైర్ కేటాయించాలని కోరారు. స్పందించిన చైర్పర్సన్, కమిషనర్ త్వరలోనే సమస్యను పరిష్కరించి సామాగ్రి అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్కూరి రవికుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ శాలం, ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాకిటిశ్యామ్, గుడెబల్లూర్ నాగరాజ్, 16వ వార్డు సభ్యులు రామ్ నారాయణ, రంజాన్ రాజా, వలంపల్లి మధు, మహమ్మద్, అమ్రేష్, అనంపల్లి రమేష్, కడేచూర్ రాజేష్ కుమార్, దామరగిద్ద రాము, వినయ్ కుమార్, వన్నె శ్రీహరి, శేఖర్, అంబాదాస్ రావు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన బనదయ్యకు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన బనదయ్యను సన్మానిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొగల్మడక గ్రామంలో ఉపాధ్యాయుడు బనదయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. బనదయ్య 24 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందించి, అనేక మంది విద్యార్థులకు విద్యాబోధన చేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దినట్టు వక్తలు కొనియాడారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నారాయణపేట బాలాజీ, జిహెచ్‌ఎం సురేష్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు జనార్ధనరెడ్డి, మండల అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షులు నర్సింహా, తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ లక్ష్మి అంజప్ప, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనురాధ, మాజీ సర్పంచ్ మహిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో బనదయ్యను శాలువాతో సన్మానం చేసి స్మారక చిహ్నాన్ని అందజేశారు.

## కల్వకుర్తిలో ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట

◆ ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు ◆ ఆర్టీసీ డిపోలో ఎక్కడికి అక్కడే నిలిచిపోయిన బస్సులు



సమ్మె చేస్తున్న కార్మికులు

**కల్వకుర్తి, ఏప్రిల్22 ప్రభాతవార్త:** కల్వకుర్తి వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో మంగళవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేశారు కార్మికులు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె సైరన్ మోగించింది. దీంతో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఆర్టీసీ డిపోలో బస్సులను పూర్తిగా నిలిపివేశారు. కార్మికులు సమస్యలను ముగించి డిపోలో తెల్లవారుజాము నుండే బంద్ పాటించారు. ముందస్తు చర్యగా పోలీసులు డిపోలో మోహరించారు. ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ప్రజలు కల్వకుర్తిలో ఉదయం నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాగా, ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన 32 హామీలను నెరవేర్చాలని ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు.

## పోలీస్ బందోబస్తుతో పేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సుల రవాణా



డిపోలో నిలిచిన పోయిన బస్సులు

**నారాయణ పేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సమ్మె పరిస్థితుల మధ్య బస్సుల రవాణాను పోలీసులు బందోబస్తు నడుమ కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా సాధారణ సేవలు నిలిచిపోవడంతో, పరిమిత సంఖ్యలో బస్సులను పోలీసుల పర్యవేక్షణలో పంపిస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బస్టాండ్ పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ బస్సులు మాత్రమే నడుస్తుండగా, అవసరమైన రూట్లలో ఆర్టీసీ బస్సులను కూడా పోలీస్ రక్షణలో పంపిస్తున్నారు. సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో రవాణా సేవలు పూర్తిగా సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పట్టే అవకాశముంది.

# విద్యా ప్రమాణాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

◆ నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి



అదనపు గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని కేజీబీవీలు, ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేషరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టర్ బాదావత్‌సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా బుధవారంనాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెల్కపల్లి మండలం రాకొండ కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ.1 కోటి 54 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అదనపు తరగతి గదులు ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మరియు పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వంఅన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కేజీబీవీలు, గురుకులాలు వంటి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒకఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నెల కొల్పి, అన్ని కులాల, అందరూ విద్యార్థులకు సమాన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ తరగతి గదుల ద్వారా విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం కలుగుతుందని, విద్యా ప్రమాణాలు మరింతమెరుగు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి రాజీ పడబోమని, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు సదుపాయాల అభివృద్ధిపై కూడా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని విద్యార్థులకు అవసరమైన అవకాశాలను కల్పించి విద్యార్థుల విద్యా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల భాగంగా విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులపై దృష్టి పెట్టినట్లు, జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైన అందుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించిన విద్యార్థిని అనిషా ను కలెక్టర్, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మరియు కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా సొంత ఇల్లు కల సాధనలో ప్రభుత్వం సహకారం అందిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారి హసీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

◆ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ ◆ పలు గ్రామ పంచాయతీలను సందర్శించిన అదనపు కలెక్టర్



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**వెల్దండ, ఏప్రిల్22 ప్రభాతవార్త:** వేసవికాలం ఉన్నందున ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అధికారులకు సూచించారు. వెల్దండ మండలంలోని పోతేపల్లి, ఎంజి తండా, గుండాల ఏకలవ్య పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో త్రాగటానికి మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సేద తీరడానికి నీడ కొరకు షెడ్డు మొదలైన వివరణ అడిగి తెలుసుకున్నారు. వెల్దండ మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా చూసే బాధ్యత గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులదేనని, ఇందిర ఇండ్ల నిర్మాణం పూర్తైన లబ్ధిదారులుగృహప్రవేశాలకుఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు నాణ్యతమైన భోజనం అందించడం తోపాటు పాఠశాలల శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అదనపు కలెక్టర్‌ను సర్పంచులు కొండల్ యాదవ్, శిరీష, దస్లిలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్ జీ, ఈసీ దేవేందర్, హౌసింగ్ఏఈ పల్లవితోపాటుపంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వాణి, ఫీల్డ్ అసిస్టెంట్స్, మేట్స్ తదితరులు ఉన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు ప్రశంసనీయం

◆ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి , రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** నాగర్ కర్నూలు జిల్లాల్లో లీడ్‌బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు ప్రశంసనీయం అని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ప్రశంసించారు. బుధవారం గోపాల్‌పేట మండల పరిధిలోని గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వీరితోపాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిజిఎం రవీంద్రబాబు, మాజీ ఆర్‌ఎం సత్యనారాయణ, నూతన ఆర్‌ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఎంపీ మల్లురవి మాట్లాడుతూ బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా 694వ బ్రాంచ్‌ను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. బ్యాంకులు రైతులకు, ఎంఎస్‌ఎమ్ఈలకు ప్రాధాన్యతగా రుణాలు ఇవ్వాలని తద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. బ్యాంకులో నుంచి రుణాలు పొందిన వారు కూడా సకాలంలో వాటిని తిరిగి చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి కూడా సహకరించాలని సూచించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా గ్రామీణస్వయం ఉపాధి కేంద్రాలనుఏర్పాటు చేస్తుందని అన్నారు. ఇన్ని సేవలు చేయడం అభినందనీయమని కొనియాడారు. నాగర్ కర్నూల్ రైల్వే లైన్ కోసం తాను పార్లమెంటులో ఎంతగానో కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా ఎంపీ తెలియజేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**గోపాల్‌పేటలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం:** గోపాల్‌పేట మండల కేంద్రం లోని ప్రభుత్వ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద రూ. 13.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సైన్స్ ల్యాబ్ ను ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా గోపాల్‌పేట మండల కేంద్రంలో రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినహైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు బుద్ధారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ మల్లురవి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, స్థానికులు అచ్యుతరామారావు, బుద్ధారం సర్పంచ్ శేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు ధాన్యం విక్రయించవద్దు

కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి

**దేవరకద్ర, ఏప్రిల్22 ప్రభాతవార్త:** రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల మండలం రేకులం పల్లి గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని సరైన ధర కొనుగోలు చేసి, వారికి లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తులతో ఇబ్బందులు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకున్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనిప్రజా ప్రభుత్వంరైతుల సంక్షేమానికి పాటు పడుతుందని అన్నారు. అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని రైతులు ధాన్యం విక్రయించాలని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సునీత, రేకులం పల్లి గ్రామ సర్పంచ్ క్రాంత్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంత రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

**నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ బాసు హనుమంతు నాయుడు**



**కెటిదొడ్డి ఏప్రిల్22, ప్రభాతవార్త:** రైతులు పండించిన పంట కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. బుధవారం గద్వాల నియోజకవర్గం కెటి దొడ్డి మండలం పరిధిలోని కొండాపుర గ్రామంలో వడ్ల డంపింగ్‌ను రైతులు, పార్టీ నాయకులతో కలిసి, ఆయన సందర్శించారు.... అనంతరం సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి, వెంటనే ఐకెపి సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా హనుమంతు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగు నీళ్ల అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడం, ఘోర వైఫల్యం చెందిందని అన్నారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండం గా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది అని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకున్నారు అని అన్నారు. కెసిఆర్ పంటలు కోయకంటే ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే వారని.. పంటలు వేయకంటే ముందే పంట ఖర్చుల కోసం రైతు బంధు ఇచ్చే వారని.. పంట కొనుగోలు చేసాక వెంటనే డబ్బులు ఇవ్వడం తో పాటు బోనస్ కూడా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేవారని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో బిఆర్‌యస్ పార్టీ చక్రధర్ రావు, బీచుపల్లి, మోనేష్, వెంకటేష్ నాయుడు, జాంపల్లి భరత్ సింహారెడ్డి, శేఖర్ నాయుడు, నక్క రవి, గాజుల కృష్ణారెడ్డి, తిమ్మప్ప గౌడ్, కావాలి గోపి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు బైక్ ఢీ వ్యక్తి మృతి

**వెల్దండ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల రాఘాయిపల్లి సమీపంలో కారు-బైక్ ఎదురెదురుగా ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో శ్రీశైలం వెళ్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దాపూర్ గ్రామానికి చెందిన చాటమోని బాలకృష్ణ(38)వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. హైదరాబాదులో తన కూతుర్లు పాఠశాల సెలవులు రావడంతో తీసుకరావడానికి వెళ్తుండగా బైక్‌పై ప్రయాణి స్తున్న కృష్ణయ్య కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి ఎస్ఐ కురుమూర్తి చేరుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

### సౌత్ జోన్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్‌కు మక్తల్ విద్యార్థుల ఎంపిక

**మక్తల్‌టౌన్, ఏప్రిల్22 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోగత జనవరి 14 న జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలలో మక్తల్ ఎల్లమ్మ కుంట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి ణులు కే. సంగీత, ఎం రేవతి క్రీడా ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికై, ఈనెల 26 నుండి 28 వరకు ఆంధ్ర ప్రదేశ్ అనంతపూర్ లో జరుగు సౌత్ జోన్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొన బోతున్న సందర్భంగా ఈ నెల 22న రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం ,పాఠశాల ప్రిన్సిపల్ అపరంజిని, పీఈటి టి. అవంతిక ఘనంగా సన్మానించి అభినందించారు. బి. గోపాలం మాట్లాడుతూ విద్యార్థిణులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తేమంచి భవిష్యత్తు ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని బి.గోపాలం తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాకారిణులనుసన్మానించిన బి.గోపాలానికి పాఠశాల ప్రిన్సిపల్ అపరంజిని, పీఈటి అవంతిక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కెజిబివి విద్యాలయాన్ని పరిశీలించిన డిఇఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

**అచ్చంపేట, ఏప్రిల్,22 ప్రభాతవార్త :** విద్యార్థులు బోధన పట్ల సామర్థ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. బుధవారం అచ్చంపేట మండలంలోని నడింపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని పరిశీలన చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు విద్యా నైపుణ్యాల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అదేవిధంగా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు అచ్చంపేట పట్టణంలో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుసుమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి (డీవైఎస్‌ఓ) వెంకటేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలో, జిల్లా యువజన, క్రీడా శాఖ సమన్వయంతో ఈ నెల 24 నుంచి జూన్ 7 వరకు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలను నిర్వహించదలచిన పీడీ, పీఈటీలు లేదా సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీనియర్ క్రీడాకారులుకనీసం జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న అనుభవం కలిగి ఉండాలని, తమ దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్ల ప్రతులను జతపరచాలని సూచించారు. స్థానికంగా ఉండి శిబిరాలు నిర్వహించగలిగే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నారాయణపేట మినీస్టేడియంలో ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాలయానికి వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఏప్రిల్ 23,2026లోపు చేరేలా పంపాలని కోరారు. గ్రామీణ కొత్త కేంద్రాలకుప్రత్యేకప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**ఉప్పునుంతల, ఏప్రిల్22 ప్రభాతవార్త:** విధులు నిర్వహించినప్పుడు సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారి యాదగిరి హెచ్చరించారు. ఆదివారం వార్త దినపత్రిక లో ప్రచురించిన కథానికి స్పందించిన ఆర్డిఓ యాదగిరి బుధవారం విచారణ జరిపారు. శనివారం దుందుభి వాగులో విధులు నిర్వహించిన సిబ్బంది చేసిన పొరపాట్ల పై ఆర్డిఓ విచారించారు. విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆర్డీఓ యాదగిరి తహసీల్దార్‌కు సూచించారు. ఆర్‌డిఓ యాదగిరి తో పాటు ఉప తహసీల్దార్ రమేష్ నాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు వేదికగా చదువుల పండుగ 2.0

మొదటి పేజీ తరువాయి భాగం..

స్టాళ్లను ఏర్పాటు చేశాయి. బోష్ సంస్థ సహకారంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు, స్వతః ఫౌండేషన్ ఆర్థిక అవగాహన కార్యక్రమాలు, ఇంక్విల్యాబ్ సంస్థ ద్వారా విద్యార్థుల ఆవిష్కరణలు, డిజిటల్ ఈక్విటీ సంస్థ డిజిటల్ లిటరసీ, ఫ్యూచర్‌డాట్స్ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యంగ్ ఒరేటర్స్ క్లబ్ ప్రదర్శనలో విద్యార్థులు తమ ఆంగ్ల నైపుణ్యాలను ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎం. గోవిందరాజు మాట్లాడుతూ రాష్ట్ర సర్వేలో ఎఫ్ఎల్ఎన్ పనితీరులో నారాయణపేట జిల్లా టాప్ 5లో స్థానం సంపాదించిందని తెలిపారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వేలో జిల్లాను రైజింగ్ డిస్ట్రిక్ట్‌గా గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సెక్టోరల్ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమానికి సర్కార్ కృషి

మొదటి పేజీ తరువాయి భాగం..

మాట్లాడుతూ సదరము, యుడి ఐడి కార్డులలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగులు అసోసియేషన్ వారు మాట్లాడుతూ వారి సమస్యల పరిష్కారానికి సలహాలు సూచనలు చేశారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చిన అన్నిరకాలసౌకర్యాలను, దివ్యాంగులకు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలోఅధికారులు, దివ్యాంగులసంఘనాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వంలో రైతులకు, మహిళలకు సమున్నత స్థానం : ఎంపి మల్లురవి

మొదటి పేజీ తరువాయి భాగం..

అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తూ లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, రెవెన్యూ అధికారి వినోద్ కుమార్, మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డిఆర్డిఓ ఉమాదేవి, డీసీఎంవో కాశీ విశ్వనాథ్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో పుష్ప, ఏబీఎన్ సదురు నాయక్, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం



**జడ్చర్ల ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల శాఖ మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే నరేంద్ర మోడీని తీవ్రవాది అని సంబోధించడం జరిగింది. దానికి నిరసనగా మల్లికార్జున్‌కర్గే గారి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు రమేష్ జి ప్రధాన కార్యదర్శిలు జగదీశ్వర్, ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్, సకనీ మల్లేష్యాదవ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మోహన్ నాయక్, కిసాన్ మోర్చా, మండల అధ్యక్షులు బరిగల శ్రీశైలం ముదిరాజ్, యువ మోర్చా మండల అధ్యక్షులు గణపతిగుప్తా, ఓబిసి మండల అధ్యక్షులు శివకుమార్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు కాశన్న, బిజెపి నాయకులు తిరుపతి, ధనుంజయ్, లింగం, యాదగిరి, జీవన్, విష్ణువర్ధన్, శేఖర్, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

## శ్రీసీతారామాంజనేయ ఆలయ ప్రారంభోత్సవానికి హాజరవుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి

**కోయిలకొండ ఏప్రిల్ 22, ప్రభాతవార్త;** కోయిలకొండ మండలం కొత్లాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ సీతా రామాంజనేయ ఆలయ ప్రారంభోత్సవానికి నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి హాజరవుతున్నారని కొత్లాబాద్ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి, గ్రామ పెద్దలు బిజ్జారం మాధవులు, భూపాల్ రెడ్డి తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందన్నారు. గ్రామంలో నవగ్రహాలప్రతిష్టాపన, వివిధ దేవతామూర్తుల ప్రతిష్టాపనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### 46 ఏళ్ల వయోపరిమితి జీవో పునరుద్ధరణకు నిరుద్యోగుల విజ్ఞప్తి

**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే నిరుద్యోగులకు గరిష్ట వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచిన జీవోనుమళ్లీ పునరుద్ధరించాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హెచ్. నర్సింహా, రాధకిషన్, నరేష్, రాహుల్, శివ అమర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. గతంలో 46 ఏళ్ల వరకు వయోపరిమితి కల్పిస్తూ జారీ చేసిన జీవో ఫిబ్రవరి 8తో గడువు ముగిసిందని వారు తెలిపారు. ఈ జీవోను పునరుద్ధరించకపోతే రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగులు అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు సకాలంలో విడుదల కాకపోవడం, విడుదలైన నోటిఫికేషన్లకుసంబంధించిన నియామకప్రక్రియలు ఆలస్యమవడం వల్ల అనేక మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు మానవతా దృక్పథంతో ఆలోచించి 46 ఏళ్ల వయోపరిమితి జీవోను వెంటనే పునరుద్ధరించాలని నిరుద్యోగులు కోరారు.

## ఓటరు జాబితాను సరిచూసుకోండి

**భూత్పూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** త్వరలో జరిగే ఉన్ని, చేనేత సహకార సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాను సిద్ధం చేసి జిల్లా ప్రధాన కేంద్రం, స్థానిక మండల తహసిల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించనైనదని జిల్లా ఉన్ని, చేనేత ప్రోసెసింగ్ కాంప్లెక్స్ సహకార సంఘం లిమిటెడ్ పర్సన్ ఇంచార్జీ నేడొక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో భూత్పూర్‌కు సంబంధించి అమిస్తాపూర్ ఉన్ని, చేనేత సహకార సంఘం సభ్యుల ఓటరు జాబితాను సిద్ధం చేసి సంబంధిత భూత్పూర్ మండల రెవెన్యూ కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఏవైన అభ్యంతరాలున్నట్లయితే సదరు ఓటర్లు ఈ నెల 25లోపు తెలపాలని, ఆ తదుపరి వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవని, ఓటర్లు ఈ విషయాన్ని గమనించి ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే ఈ నెల 25లోపు తమ కార్యాలయంలో తెలపాలని ఆయన కోరారు.

## గొడుగు రంగయ్య మృతికి పలువురి సంతాపం

**- ఆర్థిక సహాయం అందించిన పలు పార్టీల నేతలు**

**భూత్పూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ నాల్గోవార్డుకు చెందిన గొడుగు రంగయ్య(45)మంగళవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెల్సుకున్న పలు పార్టీల నేతలుహుటాహుటిన మృతుడి ఇంటికి వెళ్లి రంగయ్య మృత దేహం పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ రు. 20వేలు, నాల్గోవార్డు కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్ రు. 5వేలు, ఇదేవార్డుకు చెందిన పట్టణ కాంగ్రెస్ యువనాయకుడు గడ్డంసాయిప్రసాద్ తనవంతు ఆర్థిక సహాయంగా రు. ఐదు వేలు అందించి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు. వీరితో పాటుముదిరాజ్ మహాసభ, మత్స్యకార సంఘం తరఫున భూత్పూర్ మండల అధ్యక్షుడు గొడుగు వెంకటరాజ, పులగుర్ల మల్లేష్, గోనెల నాగరాజు, పులగుర్ల చంద్రమౌళి, పులగుర్ల వెంకటేష్‌లు తమ వంతు సహాయంగా రు. ఐదు వేల ఆర్థిక సహాయం అందజేసితమ తీవ్రసంతాపం ప్రకటించారు. మృతుడు గొడుగు రంగయ్య రోజువారి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి డిగ్రీ, ఇంటర్, స్కూల్ ఫైనల్ చదివే ముగురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు మొత్తం నలుగురు సంతానం.





# విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

**గద్వాల ఏప్రిల్22, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకంగా ఆలోచిస్తే నూతన ఆవిష్కరణలు చేయవచ్చని, సాహితీ రంగంలోనూ రాణించవచ్చని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని కస్తూర్బా విద్యాలయాల విద్యార్థులకు క్విజ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, నృత్య, నాటక, తదితర పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన వారికి బుధవారం గద్వాల బాలభవన్‌లో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలతో పాటు తీరికఉన్నప్పుడు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలన్నారు. ముఖ్యంగా ప్రతినిత్యం కొంత సమయాన్ని పత్రికలను చదివేందుకు కేటాయిస్తే విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ పై పట్టు వస్తుందన్నారు. దాంతోపాటు క్విజ్ పోటీల్లో అడిగే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు చెప్పి విజేతలుగా నిలిచేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే వేసవి సెలవుల్లో గొప్ప రచయితలు రాసిన మంచి పుస్తకాలను చదివి సాహిత్య అభిలాషను పెంపొందించుకోవాలని సూచించారు. స్టోరీ టెల్లింగ్ వంటి పోటీల్లో ప్రతిభ చాటేందుకు సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో విద్యార్థులు కూడా సాహితీవేత్తలుగా కవిత, కథ, నవల, వ్యాస, నాటక, తదితర ప్రక్రియల్లో రచనలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా వారంపాటు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రెసిడెన్షియల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వంతుగా విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్, ఇతర అధికారులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, డిడబ్ల్యుఓ సునంద, డీవైఎస్ఓ రామలింగేశ్వరగౌడ్, కేజీబీవీ కోఆర్డినేటర్ జ్యోతి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ నర్సింగరావు

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలి

**గద్వాల ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మైనర్ రిపేర్స్ గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. వసతి గృహంలో డ్రైనేజీ నీటిని బయటకు పంపించే మురుగు కాలువ దెబ్బతినడంతో ఇంకుడు గుంత నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ కుంగి పోవడంతో, ప్రహరీ గోడ పాక్షికంగా కూలిపోవడంతో మరమ్మత్తులు చేయిస్తామన్నారు. జిల్లాలోని అన్ని సంక్షేమవసతి గృహాలతో పాటు గురుకుల, కస్తూర్బా విద్యాలయాల్లోనూ అవసరమైన మైనర్‌రిపైర్స్ చేయించేందుకు సంబంధిత వార్డెన్స్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలపై అక్కడి విద్యార్థులతో అధికారులు మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ పర్యటనలో గ్రామసర్పంచ్ రవిప్రకాష్, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఎంపీడీవో అజహార్ మొహిద్దిన్, పంచాయతీరాజ్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి, వార్డెన్ నరేష్ ఉన్నారు.

# పిసిఐ సభ్యులకు సన్మానం



పిసిఐ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్22, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం ఫార్మసీ కాలేజీలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిసిఐ ఇన్స్‌పెక్టర్ గా డా. మహాలక్ష్మి శ్రీ, డా. గౌరవ్ జెఎస్ఎస్ యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ నుండివచ్చి పాలమూరు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల వసతులు, ల్యాబ్స్, గ్రంథాలయము, హెర్బల్ గార్డెన్, రికార్డ్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. గౌరవ్ మాట్లాడుతూ మేము ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపున పరిశీలించిన ఫార్మసీ కళాశాలలో పాలమూరు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల అన్ని వసతులు కలిగి ఉన్నాయని తెలిపారు. ప్రొ॥జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా ఫార్మసీ కళాశాలలో ల్యాబ్స్, నూతన పుస్తకాలు, కెమికల్స్, సమకూర్చామన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్ పిసిఐ పరిశీలనకు వచ్చినటువంటి సభ్యులను పరిపాలన భవనములోసన్మానించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎన్. చంద్ర కిరణ్, ఫార్మసి కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. రవికాంత్, ఫార్మసీ కాలేజ్ హెచ్ఓడి డా. వి. ప్రభాకర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి డా. ఏ. ఈశ్వర్ కుమార్, డా. చిన్న దేవి, డా. సోమేశ్వర్, డా. శైలేష్, డా. బి. సురేష్, డా. తరుణ్, డా. స్వాతి, డా. శారద, డా. సుజాత, డా. సుస్మిత ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థాయికి ఎదగాలి

**పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి అన్ని క్రీడల్లో పాల్గొంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి జిఎన్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ మీట్ ను 99రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యూనివర్సిటీలోని విద్యార్థులకు ఇంటర్ డిపార్ట్మెంటల్ కబడ్డీ స్పోర్ట్స్ మీట్ 2026ను క్రీడను ఎంపిక చేసుకొని క్రీడలు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ హాజరై క్రీడలను ప్రారంభించి క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని, యూనివర్సిటీకి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలు ప్రస్తుత కాలంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అలాగే మానవుడు నిరంతరం ఒక ఉత్తేజంతో పనిచేయడానికి ఎంతో సహకరిస్తాయని అలాగే పాలమూరు యూనివర్సిటీలో ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ మీట్ కూడా క్రీడాకారులగాని విద్యార్థుల కానీ ఎంతో ఉపయోగపడతాయని ఎందుకంటే వారు బాహ్య టోర్నమెంట్లో పాల్గొనేందుకు ఇవి వాళ్లకి బలాన్ని చేకూరుస్తాయని యూనివర్సిటీ ఉపకులపతి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ॥ పూస రమేష్ బాబు, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై శ్రీనివాసులు, మన్యం, అభిషేక్, శారదతో పాటు క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు కూడా ఉన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

## నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్



**నారాయణపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. వినీత్ తెలిపారు. సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు అత్యవసర సేవల వినియోగదారులు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్, రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా, ఆర్టీసీ సిబ్బంది తిరిగి డ్యూటీలో చేరినా వారికి పూర్తి స్థాయి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్సుల రాకపోకలు జరిగే మార్గాలు, డిపోలు, బస్టాండ్ ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా లేదా ఆస్తులను ధ్వంసం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులపై దాడులు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వదంతులు వ్యాప్తి చేసే వారిపై పర్యవేక్షణ కొనసాగుతోందని తెపారు. సమ్మెలో పాల్గొనే కార్మికులు శాంతియుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా మరియు ఉద్యోగ పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## అందరి భాగస్వామ్యంతో క్షయ నిర్మూలన

**క్షయ పర్యవేక్షకులు ఎండి ఆరిఫ్ ఖాన్**

**లింగాల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** క్షయ వ్యాధి నివారణ కొరకు అందరి భాగస్వామ్యం అవసరమని తద్వారా క్షయ రహిత గ్రామాలను నిర్మించాలని క్షయ పర్యవేక్షకులు ఎండి ఆరీఫ్ ఖాన్ సూచించారు. బుధవారం లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హై రిస్క్ గ్రామంగా గుర్తించిన లింగాల గ్రామంలో భవిష్య భారత్ మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే ద్వారా క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబి ముక్త్ భారతఅభియాన్ (గావ్ గావ్ షహర్ షహర్) కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో 86 హై రిస్క్ గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్క్యోసిస్ అనే బాక్టీరియా ద్వారా సంక్రమించే అంటు వ్యాదన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుడు తగ్గిన తుమ్మిన రోగకారక బ్యాక్టీరియా గాలిలో కలిసి ఆరోగ్యవంతమైన మానవులు పిలిచినప్పుడు వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. 14 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఎక్స్రే ద్వారా క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అవుతే ఆరు నెలల పాటు ఉచిత చికిత్స అందిస్తారని తెలిపారు. నిశ్చయ పోషన్ యోజన స్కీం ద్వారా నెలకు ఒక వేయి రూపాయలు అందిస్తారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థ టోటల్ హెల్త్ అపోలో ఫౌండేషన్ వారిచే పౌష్టికాహార కిట్టు అందిస్తారని, రోగులు పూర్తికాలపు చికిత్స తీసుకోవాలని తద్వారా వ్యాధి నుండి త్వరగా కోలుకుంటారనితెలిపారు. ఈకార్యక్రమంలో లింగాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ప్రశాంత్, క్షయ పర్యవేక్షకులు ఎండి అరిఫ్ ఖాన్, భవిష్య, భారత్, డా. సాయి దీప్తి, ఆరోగ్య కార్యకర్త రాజీ భాయ్, టెక్నీషియన్ ఆమన్, వీరేష్, ఆశ కార్యకర్తలు ఇందిరమ్మ, జ్యోతి, కల్పన, హరిత, ప్రమీల, నిరంజనమ్మ పాల్గొన్నారు.

## మాట తప్పని, మడమ తిప్పని మంత్రి జూపల్లి

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్**

**చిన్నంబావి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** చెప్పిన మాటకు చేసిన పనికి మాట తప్పని, మడమ తిప్పని, విలువలు గల వ్యక్తి మంత్రి జూపల్లి కృష్ణారావు అని, రాష్ట్రంలో ప్రజాపాలనలో సంక్షేమ పథకాలతో ప్రజా అభివృద్ధి పరుగులు పెడుతుందని దానికి మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి ఎనలేనిదని చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లు చంద్రశేఖర్ యాదవ్, కొప్పునూరు సింగల్ విండో మాజీ అధ్యక్షులు బగ్గరి నరసింహారెడ్డి లు అన్నారు. బుధవారం చిన్నంబావి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి ని విమర్శించడం మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జడ్పిటిసి వెంకట రమణమ్మలకు తగదని, స్థాయి మరిచి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్న వారికి అభివృద్ధితో బుద్ధి చెబుతామని వారు అన్నారు. మండల పప్పు సెనగ రైతుల కోసం అదనంగా 5 వేల టన్నుల పప్పు సెనగ కొనుగోలుకు అనుమతి సాధించారని, వ్యవసాయ కొనుగోళ్లకు సంబంధించిన కీలక విషయాలతో పాటు, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలకు తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగారి శ్రీను, పెద్ద దగడ సర్పంచ్ ఉడతల భాస్కర్, మండల కార్యదర్శి అలిపిర్, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల కార్యదర్శి కురుమయ్య, వాల్మీకి తాలూకు యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అధ్యక్షుడు రాజకుమార్ నాయుడు, వెంకటేశ్వరరావు, బిచ్చన్న, అమ్మాయి పల్లి సర్పంచ్ కవితా ప్రభంజనం గౌడ్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ విభీషణ్ యాదవ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## అడ్మిషన్ ఫోన్‌లతో.. తల్లిదండ్రులకు తలనొప్పి



◆ ప్రైవేట్ కాలేజీల ప్రచారం

◆ రోజుకు 10 నుంచి 15 కాల్స్, వాట్సాప్ మెసేజీలు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** పదవ తరగతి వార్షిక పరీక్షలు ముగిసిన వెంటనే ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు అడ్మిషన్ల కోసం దూకుడు పెంచాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు విపరీతంగా ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు వస్తుండటంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తల్లిదండ్రుల వివరాలను పాఠశాలల నుంచే సేకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వివరాల ఆధారంగా ప్రైవేట్ కాలేజీలు రోజుకు 10 నుంచి 15 వరకు కాల్స్ చేస్తూ, తమ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలనిఒత్తిడి తీసుకొస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే ఫీజుల్లో భారీ రాయితీలు అంటూ ఆకర్షణీయఆఫర్లు ఇస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈఫోన్ కాల్స్‌తో పాటు వాట్సాప్ ద్వారా బ్రోచర్లు, వీడియోలు, ఫలితాల గణాంకాలు పంపిస్తూ మరింత ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ఫోన్ ఎత్తాలంటేనే భయపడుతున్నామని, రోజు మొత్తం ఈ కాల్స్‌తో విసిగిపోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రైవేట్ కాలేజీల మధ్య పోటీతీవ్రంగా పెరగడంతో అడ్మిషన్ల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి, వారికి టార్గెట్లు కేటాయిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాలేజీల ఫోన్ ప్రచారం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోందని స్థానికులు విశ్లేషిస్తున్నారు. అదే విధంగా, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకూ ప్రైవేట్ ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల నుంచి ఇలాంటి ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. అడ్మిషన్ల కోసం నిరుద్యోగ యువత, మహిళలను ఎంపిక చేసి కాల్ సెంటర్ల మాదిరిగా పని చేయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆరోగ్య బీమా, వాహన ఇన్సూరెన్స్ సంస్థలు కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించి ఫోన్ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు ఫోన్ వినియోగంలోనే అసహనానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు స్పందించి, తల్లిదండ్రుల వ్యక్తిగత సమాచార రక్షణకు చర్యలు తీసుకోవాలని, అనవసర ఫోన్ కాల్స్‌పై నియంత్రణ విధించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు

**బిఆర్ఎస్ నేత అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** ఈ మధ్యకాలంలో స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేస్తున్న బిఆర్ఎస్‌నేత బసిరెడ్డి సంతోష్ రెడ్డి పై ఈనెల 21న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పై కేసు నమోదు చేయగా దర్యాప్తు ప్రారంభించి వాట్సాప్‌గ్రూపులో వ్యక్తిగత దూషణలు చేస్తున్న వాటిపై ల్యాండ్ అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చే విధంగా వ్యవహ రిస్తున్న బిఆర్ఎస్‌నేత తీరుపై గతంలో కూడా నేతపై పది క్రిమినల్ కేసులు నమోదు కాగా అనుచితంగా వ్యవహరిస్తున్న నేతను రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తిముందుహాజరు పరచగా 14 రోజులు జ్యూడిషల్ రిమాండ్ విధించడంజరిగిందని ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## మహిళపై దాడి

**ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని జడ్చర్ల పోలీసులపై ఆరోపణలు**



గాయపడిన మహిళ

**జడ్చర్ల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** నసురుల్లబాద్ గ్రామంలో ఒక మహిళపై జరిగిన దాడి ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదంటూ జడ్చర్ల పోలీసులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, తన పొలంలోకి జేసీబీ సహాయంతో రాళ్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించిన బంగారి పద్మ అనే మహిళను కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రవీణ్ చందర్ తీవ్రంగా దూషిస్తూ, రక్తం వచ్చేలా కొట్టాడని ఆరోపించారు. దీంతో గాయపడిన తల్లి, కూతురు న్యాయం కోసం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని పేర్కొన్నారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఈ కేసును కోర్టుకు రిఫర్ చేస్తాం, కోర్టు అనుమతి వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తాం అని సమాధానం ఇచ్చారని బాధితులు వాపోతున్నారు. రక్తపు గాయాలతో, పూర్తి ఆధారాలతో స్టేషన్‌కు వస్తే మహిళలకు కనీస భద్రత, భరోసా కల్పించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ రెండేళ్ల పదవీకాలం కోసం కాంగ్రెస్ నాయకుడిపై కేసునమోదు చేయడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పోలీసులు వెంటనే సదరు నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే రాష్ట్ర మహిళా కమిషన్, జిల్లా ఎస్పీని కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బాధిత కుటుంబం, మహిళా సంఘాలు హెచ్చరించాయి.

## ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**అచ్చంపేట, ఏప్రిల్, 22 ప్రభాతవార్త :** బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలోశ్రీ ఉమా మహేశ్వరీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ పరంగి రవి తెలిపారు. బుధవారం కొండనాగుల గ్రామంలో దోస్త్ కోఆర్డినేటర్ జాన్‌బాబుతో కలిసి గ్రామంలో సర్పంచ్ మాజీ సర్పంచులకు కలిసిమాట్లాడారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందే విధంగా గ్రామంలో ప్రచారం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శిరీష, మాజీ సర్పంచ్ శివ వార్డు సభ్యులను, అనంతవరం గ్రామ ఉప సర్పంచ్ శివ శంకర్, వార్డు సభ్యులు గ్రామపెద్దలను కలిసి, వారి గ్రామాలలో ఇంటర్ పాసైన విద్యార్థులను మాకళాశాలలో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య,. లక్ష్మగౌడ్, అధ్యాపకేతర సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ వి. నరసింహ్మారావు, జూనియర్ అసిస్టెంట్ యస్. ఆనంద్, రికార్డ్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

## రైతు భరోసా జమ

**మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ వెల్లడి**

**ఉప్పునుంతల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద మండలంలోని రైతుల ఖాతాల్లో రూ. 7 కోట్లను జమ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకుసాగు ఖర్చులకు ఆర్థికంగా తోడ్పడటమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన రైతుల వివరాలను పరిశీలించి, పారదర్శకంగా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. మండలంలోని వేలాది మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడానికి ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను సక్రమంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అలాగే, అర్హత ఉన్న ప్రతి రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.